❖•❖•❖ 36 ❖•❖•❖

# యేసు శ్రమలు

*"... వారు గొల్గొతా అనబడిన చోటునకు ఆయనను తీసికొని వచ్చిరి. గొల్గొతా అనగా కపాల స్థలమని అర్థము. అంతట బోళము కలిపిన ద్రాక్షారసము ఆయనకిచ్చిరి, గాని ఆయన దాని పుచ్చుకొనలేదు. వారాయనను సిలువవేసి ..." (మార్కు 15:22-24).*

*"మనము పాపముల విశయమై చనిపోయి, నీతివిషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను" (1 పేతురు 2:24).*

లేఖనములు మన ప్రభువు సిలువ మరణము విషయములో గల రక్తసిక్తమయిన భాగమును నివేదించుటలేదు, మత్తయి, మార్కు, మరియు లూకా మామూలుగా ఆ సంఘటన సంభవించిందని ప్రకటించారు; వారు దానిని వివరించలేదు. "వారాయనను సిలువవేసిరి"

అని మార్కు వ్రాశాడు (మార్కు 15:24ఎ), లూకా మిగిలిన సామాన్య పదములకు "అక్కడ" అను పదమును మాత్రమే అదనంగా చేర్చాడు (లూకా 23:33ఎ). మత్తయి మరియు యోహాను దీనిని పరిపూర్ణంగాలేని కోణాల్లో సూచించారు. "యేసును సిలువవేసిన తరువాత" అని యెహాను చెప్పుచున్నాడు (యోహాను 19:23; మత్తయి 27:35 చూడుము). యేసు మరణమునకు సంబంధించినంతవరకు లేఖనాల మితభాషితము అశ్చర్యమును కలిగించు విషయమై యున్నది. అది దాదాపుగా యేసు వాస్తవముగా సిలువవేయబడిన ఆ భయమును భీతిని గొలుపు క్షణము చుట్టూర ఒక పావనమైన పూజ్యభవము చుట్టుబెట్టబడి యున్నట్లున్నది. సువార్త రచయితలు ఈ వివరాలను విడిచిపెట్టి వెంటనే మన ప్రభువు సిలువ మీద వ్రేలాడుచుండినప్పుడు జరిగిన దానిని చిత్రీకరించుట మొదలుపెట్టారు.

రోమీయులు భయంకరమైన ఈ మరణ శిక్షా విధానాన్ని కార్తేజీనియుల నుండి ఎరువుతెచ్చుకొని యుండవచ్చును. సిలువ మరణ దురంతం రోమీయులకు సహితం దాని గూర్చిన ఆలోచన వణకుపుట్టించింది. గనుక వారు దానిని బానిసలు మరియు రోమా దేశ పౌరసత్వము చొప్పున ప్రత్యేకార్హతల క్రిందకు రాని వారి విషయంలో అమలు చేయుటకు ఆరక్షితముచేసి వుంచారు. ఈ చిత్రహింస ఎంత ఘోరంగా ఉండినదంటే అది ఆ నాటి పదనిధిలో ఒక క్రొత్త పదాన్ని ప్రవేశపెట్టింది. ఆ పదాన్ని వారు *cruciatus* అని పిలిచారు, ఇది వారు "సిలువ"ను సూచించు *crux* అను లాటిన్ భాషా పదములో నుండి ప్రాప్తించుకొన్నట్లు తెలియుచున్నది. "ఎక్స్‌క్రూషియేటింగ్" అను ఆంగ్ల పదము దీని నుండి వచ్చినదే.

యేసు వాస్తవిక సిలువవేయబడుట గూర్చి క్రొత్త నిబంధనలో కొంచెము చెప్పబడింది గనుక, ఆనాటి ప్రాచీన ప్రపంచంలో సిలువ వేయుట వెయ్యేరు విధములుగా జరిగింది గనుక, యేసు ఏ విధంగా సిలువవేయబడ్డాడో ఆ వివరాలు తెలిసికొనుట కష్టము. సిలువ వేయబడినవారు ముఖ్యంగా నాలుగు విధానాల్లో సిలువవేయబడ్డారని పరిశుద్ధ సత్యవేదమునకు వెలుపల గల ఇతరమైన సాక్ష్యాధారాలు తెలియజెప్పుచున్నవి. మొదటిది, అది తక్కువగా సాంప్రదాయికమైనది, ఒక నిలువు కొయ్యకు ఖైదీ శరీరము పదునైన వస్తువుతో గుచ్చివేయబడిన లేక మేకులతో దిగగొట్టబడిన "కంబము" వంటి సిలువ. యేసు ఈ విధంగా సిలువవేయబడలేదని మనము నిశ్చయంగా చెప్పుకొనవచ్చును. మిగిలిన మూడు (ఎ) "X" అక్షరము రూపములో ఉండినది (అంద్రెయ సిలువ అని పిలువబడింది), (బి) "T" అక్షరము రూపములో ఉండినది (ఆంథోని సిలువ అని పిలువబడింది), (సి) "ప్లస్ గుర్తు" (†) ఆకారములో ఉండిన సిలువ (క్రైస్తవ సిలువ అని పిలువబడింది). ఈ మూడు సాధ్యతలలో, యేసును సిలువవేయుటకు వాడబడినది ప్లస్ గుర్తు సిలువ అని క్రొత్త నిబంధనలోని వాక్య భాగము చూచాయిగా చూపించుచున్నది. యేసును సిలువవేయుటకు గల హేతువును ప్రకటిస్తూ, పిలాతు వ్రాసిన ఒక గుర్తును సువార్తల రచయితలందరు పేర్కొన్నారు. ఆ గుర్తు యేసు తలకు పైన ఉండిన సిలువ భాగములో వేయబడిందని మత్తయి మరియు లూకా చెప్పుచున్నాడు. "X" మరియు "T" ఆకారములలో నుండిన సిలువలకు తలకుపైగా ఉండిన మధ్య (అడ్డు) కంబములు లేకుండెను, గనుక ఈ గుర్తును ఈ రెండు విధములైన సిలువలలో యేసు తల పైభాగములో వేయుటకు వీలు లేదు (మత్తయి 27:37).

కొన్నిసార్లు బాహువులు మరియు కాళ్లు సిలువకు కట్టివేయబడ్డాయి, కొన్నిసార్లు అవి సిలువకు మేకులతో దిగగొట్టబడ్డాయి. ఇతర సందర్భములలో చేతులు లేదా మణికట్లు

మేకులతో దిగగొట్టబడియుండగా కాళ్లు కట్టివేయబడ్డాయి, లేదా బహువులు మరియు చేతులు కట్టివేయబడియుండగా కాళ్లు మేకులతో దిగగొట్టబడ్డాయి. యేసు విషయంలో, ఆయన చేతులు (యోహాను 20:20) మరియు కాళ్లు (లూకా 24:39) మేకులతో సిలువకు దిగగొట్ట బడ్డాయని స్పష్టమగుచున్నది; ఏలయనగా, ఆయన పునరుత్థానము తరువాత, ఆయన కాళ్లు మరియు చేతులు ఆయన అక్షరాలా సిలువవేయబడ్డాడనియు పునరుత్థానుడయ్యాడనియు రుజువుగా చూపించబడ్డాయి. ఆయన శరీరము యొక్క భారము వలన చేతులు సిలువపై నుండి వదులై శరీరము క్రింద పడిపోకుండునట్లు మేకులు ఆయన చేతుల అరచేతి పైభాగంలో గాని లేదా మణికట్లలోగాని దిగగొట్టబడివుంటాయి. కాళ్లు ఒక దానిపై మరొకటి పెట్టబడి సూది మొనతో నున్న పెద్ద మేకుతో సిలువకు దిగగొట్టబడివుంటాయి.

1968లో యెరూషలేము సమీపమున యూదుల శ్మశాన వాటికలోనుండిన శవాస్థిశాలలోన అస్థి పాత్ర ఒకటి (ఒకరి ఎముకలుండిన పెట్టె) దొరికినప్పుడు సిలువవేయబడు వాడుక గూర్చిన ఒక నిదర్శనం కనుగొనబడింది. దానిలో సిలువవేయబడిన ఒక బాధితుని, జెహోహనాన్ బిన్ హగ్‌ఖోల్ అను పేరు ఆ పాత్రపై చారిక గీయబడినవాని అస్థికలుండినవి. ఒక మేకు వాని పాదముల మడమ గుండా దిగగొట్టబడినదని (అది అప్పటికి యింకా అలాగే ఉండింది) ఆ అస్థికలు సూచించాయి.

సాధారణంగా, సిలువవేయబడినప్పుడు ఊపిరాడకపోవటం ప్రాణాంతకమైన విషయమై యుండినది. బాధితుడు శ్వాస తీసుకొనుటకు అతి కష్టంగా ఉండినది. ఉచ్ఛ్వాసము సుళువే, కానీ నిశ్వాసము కష్టం. ఈ బాధను పొడిగించుటకు, బాధితుడు దాని మీద స్వారి చేస్తున్నట్లుగా రెండు కాళ్లను రెండు వైపులలో వేసి కూర్చుండగలుగునట్లు సిలువకు మధ్య భాగంలో, ముందుకు పొడుచుకొని యున్న చిన్న భాగము ఒక విధమైన పీఠం, కొన్నిసార్లు చేర్చబడింది. గుర్రపుజీను వంటి ఈ పీఠంపై కూర్చుండుట వలన చేతుల మీద బాధితుని బరువులోని ఎక్కువ భాగము తగ్గించబడుతుంది, అప్పుడు వాడు యింగా ఎక్కువ సులభంగా ఊపిరి సలుపగలడు. కానీ ఇది సిలువపై వ్రేలాడియుండు బాధితుడు మరణించుటను జాప్యంచేసింది, చివరకు రక్తమంతా కారిపోయి దాహముగొనుచూ ప్రాణం విడుచును. యేసును వ్రేలాడ దీసిన సిలువకు మధ్యలో ఇటువంటి ఏర్పాటు చేయబడిందో లేదో తెలియదు.

యేసు సిలువవేయబడుట గూర్చిన వాస్తవిక వివరాలు క్రొత్త నిబంధన మనకు ఎక్కువగా తెలియజెప్పకపోయినప్పటికిని, ఆయన సిలువవేయబడుటకు గల సహేతువులకు సంబంధించిన సమాచారాన్ని చెప్పుకోదగినంత ఇచ్చుచున్నది. ఆయన సత్యమునకు విరోధమై యుండిన మానవుని ఉగ్రతను సహించవలసి యుండినదని అది చెప్పుచున్నది. యేసును సిలువ వేసినవారు వాస్తవానికి దేవుని సత్యమును తృణీకరించిన మత సంబంధితమైనవారై యుండిరి. వారికి దేవాలయముండినది. ప్రభావము చూపించు పలుకుబడిగల పదవులుండినవి, స్వంత స్వేచ్ఛాపూర్వక జీవనశైలి, అధికారము, అన్నీ ఉండినవి. ఈ లోక జీవితంలో వారికేమి కావాలో అన్నీ సవ్యంగా సమకూర్చబడియున్న సౌకర్యాలు కలిగి యుండిరి, గనుక వారు వాటి నుండి గల్లంతు చేయబడాలనిగాని అవన్ని తీసివేయబడాలనిగాని ఆశించలేదు. సత్యముననుసరించి సమంజసమైన మార్పులను చేయాలను ఆలోచన వారిని మనస్సాక్షి లేనివారుగాను, దేవుని కుమారుడు సిలువ వేయబడవలెనని దుర్మార్గపు కేకలతో మసలుకొను ఒక అల్లరిమూకగాను మార్చివేసింది. వారు జ్ఞాన శూన్యమైనవారును కఠిన

హృదయులును అయ్యారు, అరాచకమైనవారును క్రూరులునయ్యారు. కొరాడా దెబ్బలు వారిని తృప్తిపరచలేదు. యేసు సిలువవేయబడవలెనని వారు ఎడతెరపిలేకుండా, పిలాతు, తన సొంత శ్రేష్ఠమైన తీర్పుకు వ్యతిరేకంగా, వారి ఇష్టప్రకారమే చేయునంత వరకు కేకలు వేశారు. వారు సిలువకు దగ్గరగా నిలువబడి దేవుని భయముగాని భక్తిగాని ఏమాత్రమైనా లేకుండా మరణించుచుండిన యేసు యెడల ఎత్తిపొడుపు మాటలు విసిరారు. ఏదిఏమైనా, యేసు ఆయనపై కుమ్మరింపబడుచుండిన మానవుని ఉగ్రతనంతా ఇష్టపూర్వకంగా అనుభవించాడు.

యేసు, ఆయన సిలువ మీద మరణించుచుండగా, నీతికి విరోధమైన నరకము యొక్క ఉగ్రతను భరించాడని కూడా లేఖనములు మనకు తెలియజెప్పుచున్నవి. యుగముల యుద్ధము సిలువ చుట్టూర గుంపుగా కూడుకొని యుండినది: సత్యము మరియు దుష్టత్వము లోకము అర్థంచేసికొనని మరియు బహుశ నేటికిని అర్థంచేసికొనకుండా ఉంటున్న విశ్వ సంఘర్షణలో నిమగ్నమై యుండినవి. ఈ సంఘటనలకు సంబంధించిన ప్రవచనము ఆది 3:15తో మొదలయ్యింది: “మరియు నీకును స్త్రీకిని నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తల మీద కొట్టును; నీవు దానిని మడిమె మీద కొట్టుదువు.” యేసు ఇహ లోకములో జీవించి యుండినప్పుడు, నరకమునకు చెందిన దుష్టుడు మరియు దయ్యాలు లోక పాపముల నిమిత్తము యేసు మరణించకుండా ఆపుజేయుటకు చేయగలిగినదంతా చేశారు. వాటి కార్యశీలత ముఖ్యముగా యేసు అరణ్యములో ఉన్నప్పుడు, గెత్సేమనే తోటలో ఉన్నప్పుడు, సిలువ వేయబడుటకు దారి తీసిన తీర్పులు తీర్చబడుచుండినప్పుడు, మరియు సిలువ మరణము ద్వారా అవమానమునకు గురైనప్పుడు ఎదుర్కొన్న శోధనలలో చూడనగును. నీతిని వ్యతిరేకించిన శత్రువులు అల్లగలిగిన ఘోరాతిఘోరమైన సిలువ మరణమును, దానిని ఆయన రక్తము, బాధ, మరియు అపహాస్యముతో నింపుచు ఆయన ముందుంచారు, వారు దానిని సమస్త దూషణ మరియు చిత్రవధతో తడిపి ముద్దచేశారు. ఏది ఏమైనా, యేసు ఈ నరకయాతన నంతటినీ నమ్మకంగా అనుభవించాడు.

యేసు ఆయన మరణములో పాపమునకు వ్యతిరేకమైన పరలోక ఉగ్రతను కూడా అనుభవించాడని క్రొత్త నిబంధన మనకు బయలుపరుచుచున్నది. దీని భౌతిక కోణం వెనుక, కంటికి కనబడని వేదన వెనుక, యేసు ఎవరునూ ఊహించజాలని ఆధ్యాత్మిక భారమును భరించిన సత్యమున్నది. ఆకాశములు భూమికి పైన ఉన్నట్లుగా ఆయన తనపై వేసుకొని శ్రమనొందుచు మోసిన భారము మానవునికి పైన వానిని కప్పుచూ కాపాడుచూ ఉంటుంది. “ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను” అని పేతురు చెప్పుచున్నాడు (1 పేతురు 2:24). యేసు మరణము గూర్చి యెషయా విశదమైన ప్రవచనములో వ్రాశాడు: “మన యతిక్రమములనుబట్టి అతడు గాయపరచబడెను, మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను” (యెషయా 53:5). జరిగిన విషయాన్ని అత్యధికంగా కళ్లకుకట్టినట్లు గల చిత్రీకరణము యెషయాలో లేదా సువార్తలలో యివ్వబడలేదు, కానీ 2 కొరింథీయులకు 5:21లో ఇవ్వబడింది: “మనమాయనయందు దేవుని నీతి యగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను.” యేసు, ఒక విధంగా మనము గ్రహించగలదానిని మించి, మనకోసము పాపమయ్యాడు. విపులంగా వివరించుటకు యోహాను యింకా కొంచెము పెద్ద పదమును ఉపయోగించాడు: “ప్రాయశ్చిత్తము.” ఈ

పదమునకు “పాపమునకు విరోధమైన దేవుని ఉగ్రతను శాంతింపజేయుట” అని అర్థము. “ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు, సర్వలోకమునకును శాంతికరమైయున్నాడు” అని యోహాను వ్రాయుచున్నాడు (1 యోహాను 2:2). ఆయన మరణము గూర్చి క్రొత్త నిబంధన మనకు తెలియజెప్పుదానంతటిని మనము ఊహించుకొనజాలనప్పటికిని, ఆయన మరణించినప్పుడు పాపమునకు విరోధమైన పరలోక ఉగ్రతను యేసు భరించాడని దాని పారదర్శకతనుబట్టి గ్రహించగలము.

మనము దైవికమైన ఒక సంఘటనను పూర్తిగా నమ్మక మునుపు దానిని పూర్తిగా అర్థంచేసికొనవలసిన అవసరం మనకు లేదు. దేవుడు భూమిని ఎలా సృష్టించాడో మనము అర్థంచేసికొనలేము, కానీ ఆయన భూమిని సృష్టించాడని మనము నమ్ముదుము. యేసు ఆయన చేసిన అద్భుతములను ఆయన ఎలా చేసాడో మనమెవరమునూ వివరింపలేము కానీ ఆయన చేశాడని మనము విశ్వసించుచున్నాము. యేసు మృతులలో నుండి ఎలా లేచాడో ఎవరును ఒక శాస్త్రయుక్తమైన స్పష్టీకరణను ఇవ్వలేరు, కానీ ఆయన మృతులలో నుండి లేచాడని క్రొత్త నిబంధన ఇచ్చుచున్న సాక్ష్యమును మనము అంగీకరించవలెను. ఆయన తండ్రి యొద్దకు మరలా ఎలా ఆరోహణమయ్యాడో మనకెవరు చెప్పగలరు? ఏమి జరిగిందో మనము వివరించలేము, కానీ దాని గూర్చి దేవుని వాక్యము చెప్పుచున్న దానిని మనము అంగీకరించుచున్నాము. మనము ఈ సత్యములన్నింటిని నమ్ముదుము ఎందుకనగా అవన్నీ మనకు లేఖనములలో బయలుపర్చబడియున్నవి. సిలువను గూర్చి కూడా ఈ వాస్తవమే తథ్యము. ఆయన మన దోషమును ఆ సిలువ మ్రానుపై ఎలా భరించాడో మనకు అర్థమయ్యేనా? కాదు, అర్థం కాదు. కానీ ఆయన మన పాపములను సిలువపై భరించాడని మనము నమ్ముచున్నామా? ఔను, నిజముగా నమ్ముచున్నాము. ఈ సత్యమును మనము మన హృదయములకు విశ్వాసముతో హత్తుకొందుము ఎందుకనగా అది లేఖనములలో తేటతెల్లముగా ధ్రువీకరింపబడి యున్నది.

❖◆❖◆❖

*“నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను” (1 కొరింథీయులకు 15:3); “మన తండ్రియైన దేవుని చిత్త ప్రకారము క్రీస్తు మనలను ప్రస్తుతపు దుష్టకాలములో నుండి విమోచింపవలెనని మన పాపముల నిమిత్తము తన్నుతాను అప్పగించుకొనెను” (గలతీయులకు 1:4); “పాపములను తీసివేయుటకై ఆయన ప్రత్యక్షమాయెనని మీకు తెలియును; ఆయనయందు పాపమేమియు లేదు” (1 యోహాను 3:5).*